రహదారుణాలు





కందులపాడు గ్రామంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు



జి.కొండూరు-మునగపాడు ఆర్అండ్బీ రహదారిపై ఏర్పడిన గుంతలు

- గుంతలమయంగా రహదారులు
- చినుకుపడితే చెరువుల్లా మారుతున్న వైనం
- ప్రమదాల బారిన పడుతున్న వాహన చోదకులు
- రాకపోకల సమయంలో నరకం చూస్తున్న ప్రజలు

జి.కొండూరు: జి.కొండూరు మండల పరిధిలోని పలు గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ఉన్న ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. అడుగుకొక గుంత ఏర్పడి చిన్నపాటి వర్షానికి గుంతల్లో నీరు చేరి నిల్వ ఉంటోంది. వాహన చోదకులు రాకపోకల సమయంలో ప్రతి రోజూ సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. నిత్యం గ్రామాల్లో పర్యటించే అధికారులు, ప్రజాప్రతినిధులు చోద్యం చూడడం తప్ప స్పందించడం లేదు.

ధ్వంసమైన రహదారులు ఇవి..

- జి.కొండూరు మండల పరిధిలోని జి.కొండూరు నుంచి గడ్డమణుగు ఎస్సీ కాలనీ మీదుగా మునగపాడు వరకు బైపాస్ రోడ్డుగా పిలిచే నాలుగు కిలోమీటర్ల ఆర్అండ్బీ ప్రధాన రహదారి మొత్తం ధ్వంసమై భారీ గుంతలు ఏర్పడ్డాయి. గడ్డమణుగు లోయ ప్రాంతంలో క్వారీలు, క్రషర్ల నుంచి మెటల్, కంకర, డస్టును రవాణా చేసేందుకు భారీ వాహనాలు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించడం వల్ల రహదారి పూర్తిగా ధ్వంసమైపోయింది. ఈ రహదారిని పునర్నిర్మించడంతో పాటు పులివాగుపై ఉన్న పాత వంతెన నిర్మించాల్సి ఉంది. జి.కొండూరు నుంచి చెర్వుమాధవరం మీదుగా మునగపాడు, గంగినేని వరకు నూతనంగా విస్తరిస్తున్న స్టేట్ హైవే పనులు నతనడకన సాగుతుండడంతో ఈ రహదారిపైనే రాకపోకలు సాగుతున్నాయి.
- కందులపాడు క్రాస్ రోడ్డు నుంచి వెల్లటూరు గ్రామ శివారు వరకు ఉన్న నాలుగు కిలో మీటర్ల మేర ఆర్అండ్బీ ప్రధాన రహదారి అడుగడుగునా గుంతలు ఏర్పడి వర్షం నీటితో చెరువులను తలపిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులెవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ రహదారి మైలవరం నుంచి గణపవరం, వెల్లటూరు, కందులపాడు, వెలగలేరు గ్రామాల మీదుగా విజయవాడకు షార్ట్కట్గా ఉంది. ఈ రహదారిలో ఇటుక బట్టీల పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రహదారి విస్తరణ పనులు చేయాల్సి ఉండగా అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల అది ముందుకు సాగడంలేదు.
- 30వ నంబరు జాతీయ రహదారి నుంచి కుంటముక్కల గ్రామం వరకు మూడు కిలోమీటర్ల మేర ఉన్న పంచాయతీరాజ్ రహదారి పూర్తిగా ధ్వంసమైపోయి ఆ గ్రామస్తులు నరకయాతన పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా రహదారి అభివృద్ధికి నోచుకోపోవడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.
- కట్టుబడిపాలెం గ్రామం నుంచి కవులూరు వరకు నాలుగు కిలోమీటర్ల మేర ఉన్న ఆర్అండ్బీ ప్రధాన రహదారి ధ్వంసమై ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారిలో ఓ జిప్సం బ్రిక్స్ కంపెనీతో పాటు ఇటుక బట్టీలు, చేపల చెరువులు అధికంగా ఉండడంతో నిత్యం భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. ఏళ్ల తరబడి ఈ రహదారికి కూడా మోక్షం కలుగకపోవడంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడంలేదు.

రహదారిని అభివృద్ధి చేయాలి



మునగపాడు నుంచి జి.కొండూరు వరకు ఉన్న ప్రధాన రహదారి మొత్తం పాడైపోయింది. అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. పనులకు పోయి రాత్రి సమయాలలో బండిపై ఈ రోడ్డుపై వస్తుంటే కిందపడిపోతున్నాం. వర్షం పడినప్పుడైతే అసలు రోడ్డు ఏదో, గొయ్యి ఏదో తెలియక నరకయాతన పడుతున్నాం. అధికారులు వెంటనే స్పందించాలి.
– కామెళ్ల శశికుమార్, గ్రామస్తుడు, మునగపాడు

రోడ్డు అధ్వానంగా ఉంది



కందులపాడు క్రాస్ రోడ్డు నుంచి వెల్లటూరు వరకు ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. రాత్రి సమయాల్లో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బండి నడపాలి. అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చి రహదారిని అభివృద్ధి చేయాలి. – మందా రమేష్, గ్రామస్తుడు, కందులపాడు

రోడ్డు ప్రమాదాల నివారణకు వినూత్న చర్యలు



ఆత్కూరు క్రాస్ రోడ్డు వద్ద లారీ డ్రైవర్కు ముఖం కడిగిస్తున్న పోలీసులు

జి.కొండూరు: రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ సతీష్కుమార్ అన్నారు. జి.కొండూరు జాతీయ రహదారిపై ఆత్కూరు క్రాస్ రోడ్డు వద్ద ఎస్ఐ పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది ఆదివారం తెల్లవారు జామున వాహనాల డ్రైవర్లను కిందకు దించి నీటితో ముఖం కడిగించి పంపారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ నిద్ర మత్తులో ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు వాహన చోదకులకు నిద్ర మత్తు వీడేందుకు ఇటువంటి చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాల్లో బారికేడ్లు, రేడియం స్టిక్కర్లు అతికించిన ఇనుప డ్రమ్ములతో వేగ నియంత్రణ చర్యలు చేపట్టామని వివరించారు.

చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు

ఆగిరిపల్లి: మండలంలోని నూగొండపల్లి పెద్దప్ప చెరువులో తెలుగుదేశం పార్టీ నాయకులు అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పొలాల మెరక కోసం, గ్రామంలో రహదారి మరమ్మతుల కోసం అనుమతి తీసుకుని నూగొండపల్లిలోని స్థానిక టీడీపీ నాయకులు మట్టిని తవ్వి చెరువు పక్కనే భారీగా మట్టి నిల్వలను ఏర్పాటు చేస్తున్నారు. గత రెండు రోజులుగా మట్టిని తవ్వి ఇష్టారాజ్యంగా గుట్టలు ఏర్పాటు చేస్తున్నా అధికార పార్టీ నాయకులు కావడంతో ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

మూసివేత దిశగా చిన్నంపేట ఇంటర్ కాలేజీ

- ఫ్యాకల్టీలు లేక జీరో ఫలితాలు
- ఈ ఏడాది చేరికలు లేని వైనం

చాట్రాయి: ఉపాధ్యాయులు లేక మండలంలోని చిన్నంపేట ఇంటర్ జూనియర్ కాలేజీ మూసివేత దిశగా పయనిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్ విద్యను అందించేందుకు అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మండలానికి ఒక ఇంటర్ కాలేజీని మంజూరు చేసింది. ఇందులో భాగంగా చిన్నంపేట హైస్కూల్లో ఇంటర్ కాలేజీని ఏర్పాటు చేశారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గత విద్యా సంవత్సరంలో 28 మంది విద్యార్థులు ఇంటర్లో చేరారు. ఈ కాలేజీలో సీఈసీ, బైపీసీ తరగతుల్లో 28 మంది ఇంటర్ పరీక్షలు రాయగా 28 మంది ఫెయిల్ అయ్యారు. ఇంటర్ సిలబస్కి అనుగుణంగా బోధించేందుకు సీఈసీకి ముగ్గురు, బైపీసీకి ముగ్గురు, తెలుగు, ఇంగ్లిషు సబ్జెక్టులకు ఇద్దరు ఫ్యాకల్టీలను నియమించాల్సి ఉండగా హైస్కూల్ ఉపాధ్యాయులతో తరగతులు నిర్వహించడంతో బోధన అర్థం కాక మొత్తం విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. దీంతో కొత్తగా విద్యార్థులు చేరకపోగా పాత విద్యార్థులు టీసీలు తీసుకుని ప్రైవేటు కాలేజీల్లో చేరుతుండటంతో కాలేజీ మూతే పడనుంది. సరైన ఫ్యాకల్టీ లేకపోవడంతో గత ఇంటర్లో అందరూ ఫెయిలయ్యారని, దీంతో కొత్తగా చేరికల్లేవని, దీనిపై జిల్లా అధికారులకు నివేదిక పంపుతామని డీవైఈఓ సేవియా తెలిపారు.

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు



పాస్టర్ ఎలీషాను సత్కరిస్తున్న ఫాదర్స్, గ్రేస్ మినిస్ట్రీస్ సంస్థ పెద్దలు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ గ్రామంలోని గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఫాదర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ పాస్టర్ మోగులూరి ఎలీషా మాట్లాడుతూ ప్రతి ఏడాది జూన్ మూడవ ఆదివారం ఫాదర్స్ డే వేడుకలు ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారన్నారు. తల్లిదండ్రుల ప్రేమకు వెలకట్టలేమని చెప్పారు. పిల్లలు తండ్రి అడుగుజాడల్లో నడిచి ఉన్నత శిఖరాల అధిరోహించాలన్నారు. ఫాదర్స్ డే సందర్భంగా కొందరు తండ్రులను శాలువాలతో సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో గ్రేస్ మినిస్ట్రీస్ కార్యదర్శి సుమలత, అబ్రహాం, యోబు, ప్రభుదాసు, హరీష్, అనిల్, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

అడవిని తలపిస్తున్న కళాశాల ఆవరణ



పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తున్న కళాశాల ఆవరణ

ఆగిరిపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ అడవిని తలపిస్తోంది. కళాశాల ఆవరణ చుట్టూ పిచ్చి మొక్కలు పొదలు పెరిగి, పాములు పుట్టలతో, శిథిలమైన భవనాలతో దర్శనమిస్తోంది. దీంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. తరగతులు ప్రారంభమై వారం రోజులు దాటుతున్నా కళాశాల ఆవరణను శుభ్రం చేయించలేదు. అంతేకాకుండా కళాశాలకు ఒకవైపు ప్రహరీ లేకపోవడంతో రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కళాశాలలో పెరిగిన మొక్కలు, పుట్టలు తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బదిలీ అయిన సిబ్బందికి వీడ్కోలు



తిరువూరు: గంపలగూడెం పోలీసు స్టేషన్లో పనిచేస్తూ ఇతర స్టేషన్లకు సాధారణ బదిలీపై వెళుతున్న కానిస్టేబుల్స్కు ఆదివారం రాత్రి వీడ్కోలు పలికారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ ప్రజల మన్ననలందుకోవాలని, పోలీసులంటే ప్రజలు అభిమానించి, గౌరవించే విధంగా పనిచేయాలని ఎస్ఐ శ్రీను సూచించారు. గంపలగూడెం పోలీసు స్టేషన్ సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శులు బదిలీ అయిన కానిస్టేబుళ్లు గోపి, సురేష్, నాగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ సుధీర్, సంపత్ కుమార్లను శాలువాలతో సత్కరించారు. ఎ.కొండూరు పోలీసు స్టేషను నుంచి తిరువూరుకు బదిలీ అయిన కానిస్టేబుల్ రవికుమార్ను ఎస్ఐ కృష్ణ, సిబ్బంది సత్కరించారు.

రేపు మండల పరిషత్ సమావేశం

జి.కొండూరు: జి.కొండూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 17న ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఆహార నియమాలతో మధుమేహం నియంత్రణ



తిరువూరు: మధుమేహం రోగులు ఆహార నియమాలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ వల్లభనేని రవీంద్ర అన్నారు. తిరువూరు నాగార్జున కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మధుమేహ రోగులకు ప్రత్యేక వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. వెయ్యి మంది రోగులు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుని మందులు తీసుకున్నారు. రోగులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మధుమేహ నియంత్రణకు వైద్యులు పలు సూచనలిచ్చారు. ప్రతి రోజూ వ్యాయామం లేదా నడకతో మధుమేహాన్ని అదుపు చేయవచ్చని డాక్టర్ రవీంద్ర వివరించారు. వైద్యులు సత్య తేజ, లక్ష్మణరావు రోగులను పరీక్షించారు.

నేడు రాష్ట్ర స్థాయి యోగా పోటీలు

ఇబ్రహీంపట్నం: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గుంటుపల్లి డాన్‌బాస్కో పాఠశాలలో సోమవారం రాష్ట్ర స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తామని సమాచార పౌర సంబంధాల శాఖాధికారులు ఆదివారం ఒక ప్రకటనలతో తెలిపారు. ఈ పోటీలను సెంకండరీ హెల్త్ డైరెక్టర్ ఎ.సిరి, కలెక్టర్ లక్ష్మీశ, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

వేడినీటిలో పడి చిన్నారికి తీవ్ర గాయాలు

తిరువూరు: ఎ.కొండూరు మండలం వల్లంపట్లలో స్నానానికి సిద్ధం చేసిన వేడి నీటి బకెట్లో పడి ఒక చిన్నారి శరీరం కాలిపోయింది. గ్రామానికి చెందిన చాట్ల వసంతరావు చిన్న కుమార్తె దేవశ్రీకి స్నానం చేయించే నిమిత్తం బకెట్లో వాటర్ హీటర్ ఉంచగా బాలిక వేడి నీటి బకెట్లో జారి పడిపోయింది. ఈ ప్రమాదంలో బాలిక కాళ్లు, చేతులు, శరీర భాగం కాలింది. బాలికను విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నిరుపేదలైన వసంతరావు కుమార్తె చికిత్స నిమిత్తం గ్రామస్తులు ఆర్థిక సాయం అందజేశారు.

ఏఎంసీ చైర్మన్ వాసు ప్రమాణ స్వీకారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్గా నర్రా వాసు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. గొల్లపూడిలోని ఏఎంసీ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనతోపాటు వైస్ చైర్మన్ పాల మాధవ్ 15 మంది కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రి కొలుసు పార్థసారథి, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ తెలిపారు.

రోడ్డుపైనే మురుగునీరు నిల్వ



బొర్రగూడెం ప్రధాన రహదారిలో నిలిచిన మురుగునీరు

రాకపోకలకు బొర్రగూడెం గ్రామస్తుల ఇబ్బందులు

మైలవరం: మైలవరం మండలం బొర్రగూడెంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీలు లేకపోవడంతో గ్రామంలోని వాడుక నీరు రోడ్డుపై నిలుస్తోంది. తిరుపతమ్మ, గోపయ్యస్వామి వార్ల ఆలయానికి వచ్చే భక్తులు, గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బొర్రగూడెం గ్రామంలో సుమారు 700 మంది నివసిస్తున్నారు. నిత్యం దేవాలయానికి 200 మంది భక్తులు వస్తుంటారు. గ్రామం నుంచి వివిధ పాఠశాలలకు, కళాశాలలకు విద్యార్థులు ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తారు. మురుగునీరు ఎక్కువైతే ఇళ్లల్లోకి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

హెల్మెట్‌తో ప్రాణానికి రక్షణ

ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు



ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

ఇబ్రహీంపట్నం: హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్షణ ఉంటుందని ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు అన్నారు. సీఐ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో వాహనాల తనిఖీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఆన్లైన్లో జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఉరుకులు, పరుగుల జీవితంలో వేగానికి ఉన్న ప్రాధాన్యత భద్రతకు ఇవ్వకపోవడంతో భారీ మూల్యం చెల్లించక తప్పదన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని చెప్పారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాల విషయంలో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉండదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని హెచ్చరించారు.

క్లుప్తంగా

శ్రీశ్రీకి నివాళి

తిరువూరు: అభ్యుదయ కవి శ్రీశ్రీ వర్ధంతి కార్యక్రమం గంపలగూడెం మండలం పెనుగొలనులో ఆదివారం నిర్వహించారు. షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ చిత్రపటానికి సంస్థ కన్వీనర్ నారాయణరావు, గ్రంథాలయాధికారి శ్రీలత తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం, ప్రభవ, ఖడ్గసృష్టి, సిరిసిరి మువ్వ తదితర రచనలతో సామాజిక చైతన్యం కలిగించిన విధానాన్ని వక్తలు వివరించారు.

పోస్టల్ సిబ్బందికి సన్మానం



చాట్రాయి: మండలంలోని చనుబండ పోస్టాఫీసులో పనిచేస్తున్న నాగం శివనాగేశ్వరరావు రిటైర్మెంట్ సందర్భంగా ఆదివారం మండల పోస్టల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. నూజివీడు సబ్ డివిజినల్ పోస్టల్ అధికారి ఏసుబాబు మాట్లాడుతూ నాగేశ్వరరావు అందించిన సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బ్రహ్మాచారి, మునునూరు ఎంఈఓ సుబ్బారావు, మండల పోస్టల్ యూనియన్ నాయకులు మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వేంకటాచలస్వామికి సహస్ర దీపాలంకరణ సేవ



తిరువూరు: స్థానిక పాత తిరువూరులోని వేంకటాచలస్వామి ఆలయంలో ఆదివారం శ్రవణ నక్షత్ర సందర్భంగా సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి విశేషాలంకరణ, సహస్ర నామార్చన అనంతరం మారేమళ్ల వెంకటరాజేష్ తదితరులు దీపాలంకరణ చేశారు. వైష్ణవ గోష్టి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తాగునీరు వృథా



తిరువూరు: తిరువూరు పట్టణంలోని పబ్లిక్ కుళాయిలకు ట్యాప్‌లు బిగించకపోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. కుళాయిలు మురుగు కాలువలోల్ ఉండటంతో నీరు పట్టుకునేందుకు వీలులేక పోతోందని, ఎప్పుడు నీరు వదులుతారో కూడా తెలియడం లేదని 3వ వార్డు మహిళలు వాపోతున్నారు. నిర్ణీత సమయంలో కుళాయి నీరు వదలాలని, పబ్లిక్ కుళాయిలకు ట్యాప్‌లు బిగించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

రోడ్డు మార్జిన్లలో పశువుల వ్యర్థాలతో ఇబ్బందులు



నూజివీడు: రహదారుల వెంట కొందరు పశువుల వ్యర్థాలను వేస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ స్థలాల్లో వేసుకోకుండా రహదారుల మార్జిన్లలో వేస్తున్నారు. ఆర్అండ్బీ అధికారులు గానీ, మున్సిపల్ అధికారులు గానీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రతి నెలా మూడో శనివారం ప్రభుత్వం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పేరుతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం తప్పితే ఆచరణలో అమలు కావడం లేదు.

జూదరుల అరెస్ట్

తిరువూరు: గంపలగూడెం మండలం కొణిజర్లలో ఆదివారం రాత్రి జూదమాడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం ఎనిమిది మంది ఈ జూదాల్లో పాల్గొన్నారని, పరారైన వారి కోసం గాలిస్తున్నామని గంపలగూడెం ఎస్ఐ శ్రీను తెలిపారు. జూదరుల నుంచి రూ.46 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.